క్లుప్తంగా

క్రీడాకారుడు మొహిద్దీన్‌కు ఆర్థిక సాయం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఛండీగఢ్‌లోని పంచకులలో ఈ నెల 25 నుంచి జరగనున్న జాతీయ అంతర్ రాష్ట్రాల అథ్లెటిక్ పోటీల్లో పాల్గొనే షేక్ మొహిద్దీన్‌కు సహస్ర ఆర్థో అండ్ న్యూరో క్లినిక్ అధినేత డాక్టర్ ఎం.శివకుమార్ ఆర్థిక చేయూత నందించారని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొహిద్దీన్ ఇటీవల ఫెడరేషన్ కప్‌లో కాంస్య పతకం సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికయ్యాడన్నారు. డాక్టర్ శివకుమార్ క్రీడాకారులకు ఎప్పుడూ అండగా నిలుస్తున్నారని తెలిపారు.

రేపు కామన్ సివిల్ కోడ్‌పై సదస్సు

నగరంపాలెం: సమాలోచన (మేధావుల వేదిక) గుంటూరు ఆధ్వర్యంలో ఈనెల 23న అమరావతి రోడ్డులోని హిందూ కళాశాల ఆఫ్ ఫార్మసీ సమావేశ మందిరంలో 'కామన్ సివిల్ కోడ్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు అన్నా నందకిశోర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సుకు రాక లోకం చీఫ్ ఎడిటర్ రాక సుధాకరరావు ముఖ్య వక్తగా వ్యవహరిస్తారన్నారు. టొబాకో బోర్డు చైర్మన్ సీహెచ్. యశ్వంత్, తులసి సీడ్స్ ఎండీ తులసి యోగేష్‌చంద్ర ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగిస్తారని ఆయన పేర్కొన్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

పట్నంబజారు: వృద్ధురాలి మెడలో గుర్తు తెలియని ఓ మహిళ గొలుసు లాక్కుని పరారైన సంఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. చౌత్రా సెంటర్‌కు చెందిన నీలిశెట్టి శేషారత్నం అనే వృద్ధురాలు శుక్రవారం మధ్యాహ్నం ఇంటి బయట కూర్చుని ఉన్నారు. ఈ సమయంలో గుర్తు తెలియని ఓ మహిళ అకస్మాత్తుగా శేషారత్నం వద్దకు వెళ్లి ఆమె మెడలోని గొలుసు లాక్కుని పరారైంది. బాధితురాలు లాలాపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు విచారిస్తున్నట్లు తెలిసింది.

శ్రీవారికి చందన అలంకారం



నగరంపాలెం: స్థానిక లాలాపేటలోని శ్రీ పద్మావతి ఆండాళ్ సమేత శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ఐదో రోజుకి చేరాయి. శ్రీ స్వామి వారికి చందనం (గంధంతో) అలంకారం చేశారు. ఉదయం నిత్య హోమం, బలిహరణ, గరుడ వాహనంపై గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. 108 కలశాలతో అష్టోత్తర కలశ స్నపన అభిషేకాలు జరిగాయి. రాత్రి పుర వీధుల్లో రథోత్సవం అట్టహాసంగా కొనసాగింది. మహిళల కోలాటం అలరించింది. భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీ జగన్నాథ, శ్రీ ఆంజనేయ, శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల చైర్మన్ సూరినేడి దుర్గావరప్రసాద్, సహాయ కమిషనర్ డి.శ్రీనివాసరావు,అర్చకులు ఆర్.టి.ఆర్.వి.ప్రసాద్, శ్రీనివాసాచార్యులు, మురళీ, చంద్రకుమార్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేక ఓపీ

గుంటూరు మెడికల్: సమాజంలో మంచి గుర్తింపు వచ్చే విధంగా ట్రాన్స్‌జెండర్స్ మసలుకోవాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ సూచించారు. జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో ప్రైడ్ మంత్‌లో భాగంగా వాలంటరీ హెల్త్ సర్వీసెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ట్రాన్స్‌జెండర్స్‌కు ఉచిత వైద్య సలహాలతో పాటు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో ట్రాన్స్‌జెండర్స్‌కు ప్రత్యేకమైన ఓపీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతరం ట్రాన్స్‌జెండర్స్‌తో కలసి సూపరింటెండెంట్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, మానసిక వైద్యవిభాగాధిపతి డాక్టర్ ఉమాజ్యోతి, ప్లాస్టిక్ సర్జరీ వైద్య విభాగాధిపతి డాక్టర్ సుమితా శంకర్ పాల్గొన్నారు.

అపోలోలో రోబోటిక్ సర్జరీ వైద్య సేవలు



గుంటూరు మెడికల్: గుంటూరు అపోలో హాస్పిటల్‌లో మూత్రనాళ సంబంధిత వ్యాధులు, స్ట్రిక్చర్‌తో బాధపడుతున్న రోగులకు రోబోటిక్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని కన్సల్టెంట్, యూరాలజిస్ట్ డాక్టర్ సందీప్ బఫ్నా చెప్పారు. స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని అపోలో హాస్పిటల్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరాలజీ సమస్యలు తరచుగా బాధిస్తాయని, అలాంటి వారికి అధునాతన రోగ నిర్ధారణ, చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. యురిత్రల్ స్ట్రిక్చర్, గాయం, ఇన్‌ఫెక్షన్, ఇన్‌ఫ్లమేషన్ వల్ల కలిగే మూత్రనాళం సంకుచితం, తీవ్రమైన మూత్ర విసర్జన సమస్యలకు దారి తీస్తుందన్నారు. తమ ఆస్పత్రిలో మినిమల్లీ ఇన్వాసివ్ ట్రీట్‌మెంట్లు, విజువల్ ఇంటర్నల్ యూరెత్రోటోమీ, సుప్రా ప్యూబిక్ కాథెటరైజేషన్ వంటి ప్రొసీజర్లను అందిస్తున్నామని వివరించారు.

యోగా నిత్య జీవితంలో అంతర్భాగం కావాలి

- ప్రముఖ యోగా గురువు డాక్టర్ కొండయ్య
- విద్యాసంస్థల్లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



పాటిబండ్ల సీతారామయ్య పాఠశాలలో విద్యార్థుల యోగా విన్యాసం



ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు

గుంటూరు ఎడ్యుకేషన్: యోగా నిత్య జీవితంలో అంతర్భాగం కావాలని ప్రముఖ యోగా గురువు డాక్టర్ కె.కొండయ్య పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో విద్యార్థులకు ''నిత్య జీవితంలో యోగా పాత్ర'' అనే అంశంపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కొండయ్య మాట్లాడుతూ యోగా సాధన ద్వారా విద్యార్థులకు చదువుపై ఏకాగ్రత పెరిగి చక్కగా రాణిస్తారని తెలిపారు. వివిధ రకాల జబ్బులకు యోగా దివ్యౌషధంలా పని చేస్తుందని, దైనందిన జీవితంలో భాగంగా ఏర్పరచుకోవాలని సూచించారు. సూర్య నమస్కారాలు మానవ శరీరానికి ఏ విధంగా ఉపయోగపడతాయనే విషయాలను వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ భానుమురళి, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, ఆర్.జయశైలజ, అధ్యాపకులు ఆర్.శివాజీ పాల్గొన్నారు.

■ అమరావతిరోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో యోగా నిపుణుడు పి.బ్రహ్మానందం విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి.ఐజాక్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ అధికారి బి.సందీప్ కుమార్, విభాగాధిపతి ఐతవు నాగాంజనేయులు, అధ్యాపకులు సంధ్యారాణి, అనిత పాల్గొన్నారు.

■ బ్రాడీపేటలోని బీహెచ్ డిగ్రీ కళాశాలలో నిధివనం వ్యవస్థాపకురాలు బొల్లాపరగడ శ్రీదేవి ఆధ్వర్యంలో యోగా శిక్షకురాలు లక్ష్మి విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ బి.విజయభాస్కర్, కార్యదర్శి చూగు శ్రీధర్, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కౌసల్యాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాధామాధవి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ఎం.గిరిజ, ఎస్.దీప్తి పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక సమతుల్యత

క్రమం తప్పకుండా యోగా చేయడం ద్వారా శారీరక, మానసిక సమతుల్యత సాధించవచ్చునని భాష్యం మెయిన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ కృష్ణకిశోర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా చంద్రమౌళీనగర్‌లోని భాష్యం మెయిన్ క్యాంపస్‌లో విద్యార్థినీ, విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా కృష్ణకిశోర్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించడంలో యోగా సాధన ప్రముఖ పాత్ర వహిస్తుందని తెలిపారు. విద్యార్థులు నిత్యం యోగా చేయడం వల్ల చదువులో ఏకాగ్రతతో పాటు చురుగ్గా ఉంటారని పేర్కొన్నారు.

అభ్యుదయ కళాశాలలో యోగా దినోత్సవం

లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాలలో విద్యార్థినులు యోగా, ప్రాణాయామం సాధన చేశారు. శ్రీరామచంద్ర మిషన్ యోగా శిక్షకులు శైలజ, శివాని, మాధవి, శ్రీవాణి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈసందర్భంగా యోగా–జీవితంలో దాని ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థినులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్ఆర్కే ప్రసాద్, బి.రోహిణిదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ జేకేసీ కళాశాలలో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఏపీ శాఖ అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతదేశ పురాతన అభ్యాసన క్రియ యోగా

భారతదేశంలో ఉద్భవించిన పురాతన భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసన క్రియ యోగా అని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్పీ స్కూల్లో విద్యార్థులు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ యోగా కేవలం శారీరక శ్రమగానే కాకుండా శ్వాస, వ్యాయామాలతో కూడుకున్న ప్రక్రియ అని వివరించారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాస్, పాఠశాల వ్యవస్థాపకుడు కొండబోలు బసవపున్నయ్య, ప్రిన్సిపాల్ వై.రధినీచౌదరి, ఏవో కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా సాధనతో శారీరక ఉత్తేజం

యోగాసాధనతో శారీరక ఉత్తేజంతో పాటు మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్య ప్రయోజనాలు దక్కుతాయని గుంటూరు చలమయ్య–కర్పూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కర్పూరపు రామకృష్ణ ప్రభు పేర్కొన్నారు. శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. ఈసందర్భంగా రామకృష్ణప్రభు మాట్లాడుతూ యోగా సాధనను ప్రోత్సహించేందుకు ఐక రాజ్యసమితి ప్రతి యేటా జూన్ 21న యోగా దినోత్సవంగా జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆస్తమా ఉన్న వారికి యోగా మంచి ట్రీట్‌మెంట్ అని, యోగాతో శ్వాస, ఊబకాయం తదితర సమస్యలు తీరుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు ఏ. శ్రీధర్, శ్రీలక్ష్మి, ప్లేస్‌మెంట్ అధికారి చంద్రశేఖర్, కల్చరల్ సమన్వయకర్త మధుసూదన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

■ సాంబశివపేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో యోగా దినోత్సవం సందర్భంగా శిక్షకుడు మధుసూదన్‌రెడ్డి విద్యార్థినులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో హార్ట్‌ఫుల్‌నెస్ గుంటూరు జిల్లా జోనల్ హెడ్ ఎస్. రామకోటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

యువత యోగా సాధన చేయాలి

గుంటూరు వెస్ట్ (క్రీడలు): భారతదేశానికి మాత్రమే లభించిన అద్భుత యోగ ప్రక్రియను విద్యార్థులు నిరంతరం సాధన చేయాలని హిందూ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్ తెలిపారు. కళాశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు యోగాసనాలు వేశారు. అనంతరం యోగా గురువు పులి వెంకటేశ్వర్లును ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి సి.వి. రాము, సీహెచ్. కోటేశ్వరరావు, డి.సత్యశివ ప్రసాద్ సత్కరించారు.

తత్పురుష యోగ ఆధ్వర్యంలో

ఇన్నర్ రింగ్ రోడ్డులో తత్పురుష యోగా రీసెర్చ్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. కోచ్‌లు ఆసనాలు వేస్తూ వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు, ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో షేక్ సయ్యద్ వలి, రవితేజ, సౌమ్య పాల్గొన్నారు.

భారతదేశపు అద్భుతం యోగా

భారతదేశం ప్రపంచానికి అందించిన అద్భుతాలలో యోగా ఒకటని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం లక్ష్మీపురంలోని సీతారామయ్య స్కూల్లో విద్యార్థులు యోగా సాధన, ప్రాణాయామం చేశారు. పాఠశాల లోగో ఆకారంలో యోగా గురువు జంపాల రమాదేవి పర్యవేక్షణలో ప్రదర్శనలిచ్చారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్య జీవనానికి సులువైన సాధనం యోగా అన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్ దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

యోగాతో సర్వ రోగాలు మాయం

గుంటూరు మెడికల్: అంతర్జాతీయ యోగా డేని పురస్కరించుకుని డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని అహల్య నర్సింగ్ హోంలో యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా మాజీ మంత్రి, బీజేపీ నాయకురాలు డాక్టర్ శనక్కాయల అరుణ మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యోగాకి అత్యంత ప్రాముఖ్యత ఇచ్చి ప్రపంచ దేశాల్లో జూన్ 21న నిర్వహించేలా గుర్తింపు తీసుకొచ్చారని తెలిపారు. రోజూ యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు రోజంతా ఎంతో ఆహ్లాదంగా ఉంటుందని తెలిపారు. యోగాతో సర్వ రోగాలు మాయం అవుతాయని పేర్కొన్నారు. యోగాపై సహజానంద యోగి, మల్లికార్జునరావు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హాస్పిటల్స్ సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనానికి యోగా చాలా అవసరం

లక్ష్మీపురం: ప్రశాంత జీవనానికి యోగా చాలా అవసరమని, శరీరానికి నూతన ఉత్సాహం కలుగుతుందని ప్రముఖ యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనసు, శరీరం, ఆత్మను నియంత్రించడంలో యోగా చాలా ఉపయోగ పడుతుందని తెలిపారు. యోగా ఒక శక్తివంతమైన మైండ్ ఫ్రీనెస్ సాధన అన్నారు. యోగాచార్యులు శివనాథం మాట్లాడుతూ యోగా చేయడం వల్ల రక్తపోటు అదుపులోకి వస్తుందని, శ్వాసక్రియ శక్తి కూడా మెరుగు పడుతుందని తెలిపారు. అనంతరం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సభ్యులు యోగాచార్యులు ఇందుశేఖర్, శివనాథం సాయిబాబాలను సత్కరించారు.

మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా



గుంటూరు మెడికల్: మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా దోహదపడుతుందని రచయిత, సామాజిక విశ్లేషకులు టి.ధనుంజయరెడ్డి తెలిపారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్ ఫేస్‌- 2 గాయత్రి పార్కులో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ధనుంజయరెడ్డి పాల్గొన్నారు. జబ్బులు లేకపోవడం ఆరోగ్యం కాదన్నారు. ఆరోగ్యం అంటే శారీరకంగా, మానసికంగా, సామాజికంగా బాగున్నాననే పరిపూర్ణమైన స్థితి అని వివరించారు. యోగా శిక్షకులు కాలిశెట్టి వెంకట నాగేంద్ర ప్రసాద్ ప్రత్యేక ధ్యానం, ముద్రలు, ఆసనాలతో సాధన చేయించారు. గాయత్రి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.రత్నారెడ్డి, కోశాధికారి రవీంద్ర ప్రసాద్, నిర్వహణ కార్యదర్శి హనుమంతరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త చిర్రా రామలింగారెడ్డి, వ్యాపారవేత్త కొత్తమాసు వెంకటేశ్వరరావు, శ్రీ సైనిక్ ఇన్ఫ్రా తాళ్ల నాగరాజు, బి.రమేష్, ఆనంద్ కుమార్, ప్రేమ్ కుమార్, శ్రీరామమూర్తి, రాజేంద్రప్రసాద్, యోగ సభ్యులు పాల్గొన్నారు.







పట్టణంలోని నటరాజ్ యోగా నిలయంలో యోగా విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు



టీజేపీఎస్ కళాశాలలో సూర్య నమస్కార ప్రాధాన్యం వివరిస్తున్న గురువు కొండయ్య



హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో యోగాసనం వేస్తున్న నిపుణుడు బ్రహ్మానందం



యోగాసనాలు వేస్తున్న భాష్యం విద్యార్థినులు



యోగా చేస్తున్న డాక్టర్ శనక్కాయల అరుణ, తదితరులు



అభ్యుదయ కళాశాలలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు



చలమయ్య కళాశాలలో మాట్లాడుతున్న కర్పూరపు రామకృష్ణ ప్రభు



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులతో కృష్ణప్రసాద్, రధినీచౌదరి

ఘనంగా రామచంద్ర ప్రభు, కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు

కొరిటిపాడు(గుంటూరు): ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు, ఆయన కుమారుడు తులసి కృష్ణ చైతన్యల జన్మదిన వేడుకలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అరండల్‌పేటలోని యోగి భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కుమారులు తులసి యోగిష్, తులసి కృష్ణ చైతన్య, మనవడు తులసి ఆదిత్య సమక్షంలో భారీ కేకును రామచంద్ర ప్రభు కట్ చేశారు. ప్రముఖులు డాక్టర్ మద్దినేని గోపాలకృష్ణయ్య, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్, వ్యాపారవేత్త మలిశెట్టి సుబ్బారావు, సుప్రీమ్ సర్జికల్స్ జవహర్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ పేద విద్యార్థులకు 25 ఏళ్లకు పైగా ఉపకార వేతనాలు అందిస్తున్నామని, భవిష్యత్‌లో మరిన్ని ప్రజోపయోగ కార్యక్రమాలు కూడా చేస్తామని వెల్లడించారు.



కేక్ కట్ చేస్తున్న తులసి రామచంద్ర ప్రభు

■ అరండల్‌పేటలోని తులసి సంస్థల కార్యాలయంలో ఉద్యోగులు, అభిమానుల సమక్షంలో తులసి రామచంద్ర ప్రభు, తులసి కృష్ణ చైతన్య జన్మదిన వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. జిల్లా నలుమూలలనుండి వచ్చిన తులసి రామచంద్ర ప్రభు అభిమానులకు, శ్రేయోభిలాషులకు, తులసి గ్రూప్ సిబ్బందికి ఏటుకూరు మాజీ సర్పంచ్ ఉగ్గిరాల సీతారామయ్య ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోతురాజు సమత, యర్రంశెట్టి పద్మావతి, దాసరి లక్ష్మి దుర్గ, వాసు, మాదా రాధ, తోటకూర సుబ్బారావు, మలిశెట్టి సుబ్బారావు, దళవాయి సుబ్రహ్మణ్యం, కనకం నరసింహారావు, తోట శ్రీనివాస్, తిరుమలశెట్టి రమేష్, ఉగ్గిరాల సీతారామయ్య మిత్రమండలి, వీరబాబు, బొల్లిముంత కృష్ణార్జునరావు, అప్పిశెట్టి రంగారావు, స్టే రమేష్, ఉగ్గిరాల రాజా, ఉగ్గిరాల కోటేశ్వరరావు, వివేకానంద శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఆవుల విజయ

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో హెడ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఆవుల విజయకు శుక్రవారం గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ప్రమోషన్ లభించింది. గుంటూరు ఆర్డీ కార్యాలయంలో శుక్రవారం అధికారులు ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒంగోలులో పనిచేస్తున్న నాంచారమ్మకు గుంటూరు జీజీహెచ్‌లో, గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న ధనలక్ష్మికి ఒంగోలు జీజీహెచ్‌లో, గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న రమాదేవికి గుంటూరులోనే గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్లుగా ప్రమోషన్లు లభించాయి. ఆర్డీ డాక్టర్ శోభారాణి, డీడీ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ షేక్ నాగూర్ షరీఫ్, సీనియర్ అసిస్టెంట్ సుబ్బారావు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు.

గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండ్‌గా షేక్ షమీనా

జీజీహెచ్‌లో గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న షేక్ షమీనా బేగంకు ప్రమోషన్ లభించింది. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయం అధికారులు శుక్రవారం జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆమెకు గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండ్‌గా ప్రమోషన్ ఇచ్చి ఏలూరు ఆసుపత్రికి బదిలీ చేశారు.


ఆపరేషన్‌తో పనిలేకుండా మందులతోనే చికిత్స

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్యులు ఆపరేషన్ చేయకుండానే మందులతోనే రోగికి ఉపశమనం కలిగించారని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ తెలిపారు. వైద్యం గురించి శుక్రవారం ఆయన వివరించారు. కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన పి.నరసింహారావు గత నెల 23న ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధితో అత్యవసర విభాగానికి వచ్చాడు. తీవ్రమైన దగ్గు, ఆయాసం, గుండె నొప్పి, గుండె మంటతో బాధ పడుతున్నాడు. అతిగా మద్యం అలవాటుతో తరచుగా వాంతులతో అన్నవాహికలో చీలిక వచ్చింది. ఇది ఊపిరితిత్తుల్లోకి వెళ్లిందని సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ వివరించారు. ప్రైవేటు వైద్యులు ఆపరేషన్ చేయాలని, చాలా ఖర్చు అవుతుందని చెప్పడంతో రోగి జీజీహెచ్‌కు వచ్చాడన్నారు. ఎలాంటి ఆపరేషన్ లేకుండానే ఎండోస్కోపి ద్వారా వైద్యం అందించి మందులతో వ్యాధిని నయం చేశామని తెలిపారు. వెంటిలేటర్‌పై ఉన్న పేషంట్‌కు వైద్యులు సమయస్ఫూర్తితో వ్యవహరించి సకాలంలో వైద్యం అందించి ఉపశమనం కలిగించారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఆయన సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యుల్ని అభినందించారు. కార్యక్రమంలో సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ డాక్టర్ అందె కోటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చికిత్స చేయించుకున్న నరసింహారావుతో డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ కోటి వెంకటేశ్వరరావు

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత



నెహ్రూనగర్: చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక మాసాన్ని పురస్కరించుకుని 21వ డివిజన్ కొండా వెంకటప్పయ్య కాలనీలో శుక్రవారం ఆటోల ద్వారా ఆడియో ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ జి. వెంకట్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను అంతం చేయడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న బాలల్ని పనిలో పెట్టుకోరాదని తెలిపారు. 14 నుంచి 18 సంవత్సరాల మధ్య ఉన్న వారిని ప్రమాదకరమైన సంస్థలు, ప్రదేశాలలో నియమించడం నిషేధించబడిందని చెప్పారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల బాలలు శారీరకంగా, మానసికంగా, లైంగికంగా ఇబ్బందులకు గురవుతారన్నారు. బాలల్ని పనిలో పెట్టుకుంటే ప్రభుత్వం జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తుందని తెలిపారు. ఎవరైనా బాల కార్మికులను గుర్తిస్తే టోల్ ఫ్రీ నంబర్ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా 18001027222కు ఫోన్ చేసి తెలియజేయాలని ఆయన కోరారు.